భావి పౌరుల పైనే దేశ భవిష్యత్తు


హిందూపురం మండలం కొట్నూరు జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థినుల నృత్యం


చిలమత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


లేపాక్షి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న సర్పంచ్ ఆదినారాయణ

సాక్షిబృందం: భారత తొలి ప్రధాన మంత్రి చాచా నెహ్రూ జయంతి సందర్భంగా జాతీయ బాలల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ నెహ్రూ చిత్రపటాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో ర్యాలీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. నేటి బాలలే రేపటి పౌరులని, దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని వక్తులు తెలిపారు. ఇప్పటి నుంచే బాగా చదువుకొని ఉన్నతస్థాయిలో స్థిరపడి దేశానికి, కుటుంబానికి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం దేశం కోసం జవహర్‌లాల్ నెహ్రూ చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు.


హిందూపురం: బాలసదన్‌లో చిన్నారులకు స్వెటర్లు పంపిణీ చేస్తున్న హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక


పెనుకొండ: నెహ్రూ వేషధారణలో చిన్నారులు


సోమందేపల్లిలో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం


అమరాపురంలో నెహ్రూ చిత్రపటానికి నమస్కరిస్తున్న విద్యార్థులు


రొళ్ల మండలం ఆవినకుంట కేజీబీవీలో వ్యాసరచన పోటీలో పాల్గొన్న బాలికలు


గుడిబండ: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం


అగళి ఏపీ మోడల్ పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

చింతపండు ప్రాసెసింగ్‌పై శిక్షణ


శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అమరాపురం: ఖాదీ, గ్రామ పరిశ్రమల కమిషన్ భారత ప్రభుత్వం , శ్రీ అనంతలక్ష్మీ పట్టు గ్రామీణ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, సీసీ నాగరాజు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బసవనపల్లిలో శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5 రోజుల పాటు చింతపండు ప్రాసెసింగ్‌పై 20 మంది చొప్పున రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణలో ఇచ్చే మొలకువలతో సొంతంగా చింతపండును ప్రాసెసింగ్ చేయడాన్ని నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యమ్మ, ఎంపీటీసీ నరసింహమూర్తి, సీసీ నాగరాజు, ఖాదీ సంస్థ కార్యదర్శి రఘునాథ్ తదితరులు పాలొన్నారు.

21 నుంచి క్రికెట్ టోర్నమెంట్

సోమందేపల్లి: మండల కేంద్రంలో ఈ నెల 21 నుంచి టీ–10 చాంపియన్‌షిప్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు రమాకాంత్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదినాన్ని పురస్కరించుకొని నెల రోజుల పాటు జరిగే క్రికెట్ టోర్నమెంట్‌కు ఈ నెల 18లోపు జట్లు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. విన్నర్ జట్టుకు రూ.1 లక్ష, రన్నర్ జట్టుకు రూ.50 వేలు బహుమతి అందజేస్తామన్నారు. వివరాలకు 8885851437, 9160681786 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

లేపాక్షిలో సహకార వారోత్సవాలు


సహకార వారోత్సవాల్లో భాగంగా జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని స్థానిక కొండూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘంలో మంగళవారం చైర్మన్ రమేష్‌రెడ్డి అధ్యక్షతన సహకార వారోత్సవాలను జరుపుకున్నారు. సబ్ డివిజనల్ సహకార సంఘం అధికారి వన్నూరప్ప మాట్లాడుతూ లేపాక్షి, కొండూరు గ్రామాలకు గోదాములు మంజూరయ్యాయని, అయితే లేపాక్షిలోని గోదాము పనులు పూర్తయ్యాయని, కొండూరుకు సంబంధించి గోదాము పనులు ప్రారంభం కాలేదన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శంకరప్ప, క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల


అమరాపురంలో పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

మరాపురం: స్థానిక గ్రంథాలయం ఆవరణలో మంగళవారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ డైరెక్టర్ సుందర్‌రాజు ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఇబ్రహీం మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా వారోత్సవాల పోస్టర్లు విడుదల చేశామన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రొద్దం: మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో నేడు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభిస్తామన్నారు. సమావేశానికి అన్ని శాఖల మండలస్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు తప్పక హాజరు కావాలన్నారు.

రాగి జావతో సంపూర్ణ ఆరోగ్యం


విద్యార్థులతో కలిసి రాగి జావను తీసుకుంటున్న ఎంఈఓ

రొళ్ల: పౌష్టికాహారంతో కూడిన రాగి జావను తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంఈఓ–2 శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని హొట్టేబెట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. తొలుత విద్యార్థులతో కలిసి రాగి జావను తీసుకున్నారు. అనంతరం ఆయన ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు–నేడు ద్వారా నిర్మాణం చేపట్టిన మరుగుదొడ్లు, వంట గది ఇతరాత్ర వాటిని పరిశీలించారు.

కార్మికుల అభ్యున్నతికి కృషి


వైఎస్సార్‌సీపీ నాయకులను సన్మానిస్తున్న ఆటోనగర్ నూతన కమిటీ సభ్యులు

హిందూపురం: ఆటోనగర్ కార్మికుల అభ్యున్నతికి తమ వంతు కృషిచేస్తామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, బాబురెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి మంగళవారం ఆటోనగర్ నూతన కమిటీ కార్యవర్గ సభ్యులు, కార్మికులు తరలివచ్చారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులను ఘనంగా సన్మానించారు. వేణురెడ్డి మాట్లాడుతూ ఆటోనగర్ కార్మికులతో పాటు అక్కడి ప్రజలకు అవసరమైన సదుపాయలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం ఆటోనగర్ అధ్యక్షుడు అంజాద్‌ఖాన్, కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, పార్టీ నాయకులు కొల్లకుంట ఆనంద్‌రెడ్డి, ఏబ్లాక్ అధ్యక్షుడు సాధిక్, నాయకులు ఖలీల్, మార్కెట్ చాందు, ఫరూక్, తదతరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత


వైఎస్సార్ బీమా చెక్కు అందిస్తున్న నాయకులు

హిందూపురం: పట్టణంలోని 28వ వార్డులోని వాల్మీకినగర్‌లోని సువర్ణమ్మకు వైఎస్ఆర్ బీమా ద్వారా మంజూరైన రూ.లక్ష చెక్కును మంగళవారం వార్డు కౌన్సిలర్ మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. బిల్డింగ్ మేస్త్రీగా పనిచేస్తున్న బోయ వేణుగోపాల్ (49) ఇటీవలే చనిపోయారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ బీమా ద్వారా రూ.లక్ష మంజూరు చేశారు. తక్షణ సహాయం కింద రూ.10 వేలు, ప్రస్తుతం రూ.90 వేలు ఆర్థిక సహాయం అందించారు.

ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు


ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

పెనుకొండ: పట్టణంలో మంగళవారం బైబిల్ మిషన్ చర్చిలో 'యేసు రెండో రాకడ' పండగను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ సుధాకర్, రెవరెండ్ ప్రభాకర్‌రాజ్ తదితరులు మాట్లాడారు. ప్రజల క్షేమం కోరి యేసు ప్రభువు రెండోసారి లోక కళ్యాణార్థం భువిపైకి వస్తున్నట్లు చెప్పారు. అనంతరం ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనలకు వివిధ ప్రాంతాల నుంచి క్రైస్తవులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

శుభ కార్యం


వివాహవేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: గోరంట్ల మేజర్ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ ముస్తఫా కుమారుడు అఫ్జల్ వివాహ వేడుక గుమ్మయ్యగారిపల్లి సమీపంలోని ఎంఎంఎస్ ఫంక్షన్ హాల్ మంగళవారం జరిగింది. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ స్థానిక నాయకులతో కలసి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

మూఢనమ్మకాలు పారదోలాలి

- అదనపు జిల్లా జడ్జి శైలజ


మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి శైలజ

హిందూపురం అర్బన్: సమాజంలో మూఢ నమ్మకాలను పారద్రోలేందుకు విద్యార్థులు కృషి చేయాలని అదనపు జిల్లా జడ్జి శైలజ పిలుపునిచ్చారు. మంగళవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పరిగి మండలంలోని అంధుల ఆశ్రమ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యకు అంగవైకల్యం ఏ మాత్రం అవరోధం కాదని, బాగా చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏజీపీ శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు సిద్దు, సుదర్శన్, పాఠశాల ప్రిన్సిపాల్ కరీం తదితరులు పాల్గొన్నారు.

కొల్హాపురి మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

రొళ్ల: రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జామున అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన, తులసీ పూజ చేశారు. అనంతరం అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

జరిగిన మంచిని వివరించండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ సూచించారు. బుధవారం గోరంట్ల పార్టీ కార్యాలయంలో బూత్ కమిటీ కన్వీనర్లు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త, స్థానిక ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఆయా బూత్ కమిటీ పరిధిలోని వలంటీర్లు, గృహసారథులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం చేపట్టిన సంక్షేమ పథకాలు ,వాటి ద్వారా పేదలకు కలిగిన లబ్ధిని వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ బాషా, మండల సచివాలయ కన్వీనర్ నరసింహారెడ్డి, జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, గోరంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు నూర్ మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రను విజయవంతం చేయండి

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలో బుధవారం నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డితో కలిసి పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో బస్సు యాత్రపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్సుయాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. హిందూపురంలో నిర్వహించే యాత్రను కూడా విజయవంతం చేయడానికి ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. ప్రజలు, పార్టీ శ్రేణులకు ఆయా పంచాయతీల నాయకులు కార్యక్రమంలో పాల్గొనేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.

'పురం'లో నేడు ట్రాఫిక్ ఆంక్షలు

హిందూపురం అర్బన్: హిందూపురం పట్టణంలో బుధవారం మధ్యాహ్నం అంబేడ్కర్ కూడలిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న సామాజిక సాధికార బస్సుయాత్ర సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు వన్ టౌన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. బెంగళూరు వైపు నుంచి వచ్చే వాహనాలు ఆటోనగర్ బైపాస్ మీదుగా రహమత్‌పూర్ సర్కిల్, రిలయన్స్ పెట్రోల్ బంక్, బీఎస్‌టీ సర్కిల్ వైపుగా మళ్లిస్తున్నట్లు చెప్పారు. అలాగే కొట్నూరు వైపు నుంచి బెంగళూరు వైపు వెళ్లే వాహనాలు హైవే మీదుగా వెళ్లాలని , లేపాక్షి వైపు నుంచి వచ్చే వాహనాలకు హిందూపురం పట్టణంలోనికి ప్రవేశం లేదని హైవే మీదుగా వెళ్లాలని సూచించారు. పట్టణంలో బాలాజీ సర్కిల్, కేఎల్ రోడ్డు, పరిగి రోడ్డు నుంచి అంబేడ్కర్ సర్కిల్ వైపు వచ్చే వాహనాలను అనుమతించమని, ప్రత్యామ్నాయ మార్గాలైన కట్టకింద, వాసవీ ధర్మశాల రోడ్ల మీదగా వెళ్లాలని సీఐ సూచించారు. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

విభిన్నంగా దీపావళి


పూల గంపలతో కన్యలు

పావగడ: తాలూకాలోని భూపూరు తండాలో దీపావళి పండుగను స్థానికులు మంగళవారం విభిన్నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని కన్యలు దీపాలతో తండాలోని ఇంటింటికీ వెళ్లి ఇంట్లోని కుటుంబ సభ్యుల పేర్లు, దేవుని పేరు తెలిపి వారికి శుభాకాంక్షలు తెలిపారు. సుఖ శాంతులతో జీవించాలని ఆశీర్వదిస్తూ వారి ఇంటిలో దీపం వెలిగించారు. అదే విధంగా ఉదయం పొలాలు, కొండ గుట్టల ప్రాంతాల్లో సేకరించిన వివిధ రకాల పూలను వారి ఇళ్ల ముందు వేసి శుభాకాంక్షలు తెలిపారు.

కన్నడ కన్న తల్లి లాంటిది


సభలో మాట్లాడుతున్న రామచంద్రప్ప

పావగడ: కన్నడ భాష కన్న తల్లి లాంటిదని కన్నడ భాషను విస్మరిస్తే అమ్మను మరచిపోయినట్లేనని స్థానిక ఆంధ్ర గడినాడు అధ్యక్షుడు హెచ్ రామచంద్రప్ప తెలిపారు. తాలూకాలోని క్యాతగానహళ్లి మంజునాథస్వామి గ్రామీణ ఉన్నత పాఠశాలలో కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కన్నడ రాజ్యోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి , ఎం గంగాధరప్ప, హెచ్ఎం శ్రీనివాస్, కన్నడ ఉపాధ్యాయుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోగిర జై సీతారామ్ జయంతి


జై సీతారామ్ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

రొద్దం: మండల పరిధిలోని కోగిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కవి జాబిలి చాంద్‌బాషా, సాహితీ స్రవంతి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కవి కాకి బిరుదు పొందిన జై సీతారామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం నారాయణరెడ్డి అధ్యక్షత జరిగిన సమావేశంలో ప్రముఖ కవి ఏలూరి యంగన్న ప్రధాన వక్తగా పాల్గొని జై సీతారామ్ సాహితీ జీవితం గురించి వివరించారు.

కాళికాదేవికి ప్రత్యేక పూజలు



పావగడ: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక ఆఫ్ బండ పై వెలసిన కాళికాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నరేశ్‌స్వామి ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.